కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

హైదర్‌నగర్, మే27 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాల్లో ఆడ పిల్లల వివాహాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి (పార్ట్) డివిజన్ల పరిధిలోని పలువురికి మంజూరైన చెక్కులను కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ 10మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు మహిళలు పాల్గొన్నారు.

రమాభాయి అంబేడ్కర్‌కు నివాళి



రమాభాయికి నివాళులు అర్పిస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం

ఫతేనగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): రమాభాయి అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పేర్కొన్నారు. రమాభాయి 90వ వర్ధంతి సందర్భంగా గూడ్స్‌షెడ్ రోడ్డులో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌తో జీహెచ్ఎంసీ అధికారులు

బోయిన్ చెరువు సుందరీకరణ పనులను వేగవంతం చేయాలి : కార్పొరేటర్ ముద్దం

ఓల్డుబోయినపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్ హస్మత్‌పేట బోయినిచెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. చెరువు పక్కనే ఉన్న నాలా రిటర్నింగ్ వాల్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ రమేష్, సోమేష్, డివిజన్ నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ ఓల్డుబోయినపల్లి డివిజన్‌లోని మైత్రివనం కాలనీలో సమస్యలను తెలుసుకునేందుకు పాదయాత్ర నిర్వహించారు.

కాలనీలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయండి

అల్లాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రినగర్‌లో కొద్ది కాలంగా రాత్రిళ్ల వీధుల్లో విద్యుత్‌దీపాలు వెలగటంలేదని ఆ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణారావు, కార్యదర్శి వెంకటరమణ కార్పొరేటర్ సబీహా బేగంకు వినతిపత్రం అందజేశారు. వార్డు కార్యాలయంలో మంగళవారం కార్పొరేటర్‌తో భేటీ అయిన సంక్షేమ సంఘం ప్రతినిధులకు సానుకూలంగా స్పందించిన సబీహా బేగం సత్వరమే శాఖా అధికారులతో సంప్రదించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం

- అన్ని రంగాల్లో భారత్ పురోగతి
- కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్
- ఐఎస్‌బీలో కేంద్ర ఆర్థిక గణాంకాల వార్షిక సర్వే ఫలితాల డేటాపై సదస్సు



సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ అనంత నాగేశ్వరన్

రాయదుర్గం, మే27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం కొనసాగుతుంటే భారత్ అన్ని రంగాల్లో స్థిరమైన పురోగతి సాధిస్తుందని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి.అనంత నాగేశ్వరన్ అన్నారు. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ, జాతీయ గణాంకాల కార్యాలయం, ఐఎస్‌బీ, ఇన్‌కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తాధ్వర్యంలో 2023-24 వార్షిక సర్వే డేటా ఫలితాలపై మంగళవారం ఐఎస్‌బీలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. తయారీ రంగంలో పటిష్ఠమైన మూల ధన వ్యయంతో సంస్థలు, మహిళా వ్యవస్థాపక వృద్ధిలో పురోగతి సాధిస్తుందన్నారు. ఇన్‌కార్పొరేటెడ్, వ్యవసాయేతర రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధిస్తున్నామని ఈ సర్వే గణాంకాల డేటా వెల్లడిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న అనిశ్చితి యుగంలో భారత ప్రభుత్వ విధాన పరమైన సంస్కరణలు రూపొందించటానికి ఇటువంటి వివరణాత్మకమైన డేటా ఎంతో కీలకంగా మారుతుందన్నారు. గణాంక కార్యక్రమాల కార్యదర్శి డాక్టర్ సౌరబ్‌గార్గ్ మాట్లాడుతూ, ప్రభుత్వం పటిష్ఠమైన పురోగతికి అన్ని రంగాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించిన గణాంకాల డేటా భవిషత్తులో ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ డేటాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు మోతీనగర్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

అల్లాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్ డివిజన్ పరిధిలోని మోతీనగర్ హౌసింగ్ సొసైటీకి బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 407 సభ్యులు గల ఈ సొసైటీకి ప్రాతినిధ్యం వహించేందుకు 25 మంది బరిలో ఉండగా, వారిలో నుంచి కొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోనున్నారు.

2 నుంచి వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవాలు

అల్లాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 2నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తారని ఆయన తెలిపారు.



ఫతేనగర్ స్టేషన్ గేటు తెరవాలని రైల్వే డీజీఎంకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్‌తో బీఆర్ఎస్ నాయకులు



ఘటనా స్థలాన్ని సందర్శించిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌తో కాంగ్రెస్ నాయకులు

ఫతేనగర్ స్టేషన్ గేటు తెరవాలి

ఫతేనగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ రైల్వే స్టేషన్ పక్కనే శిథిలావస్థలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రమాదంపై కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ స్పందించారు. ప్రమాద ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను హైడ్రా అధికారులకు, కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ అపూర్వ చౌహాన్ ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు కుంగి పోయిన మెట్లను కూల్చి వేసే వరకు కార్పొరేటర్ పర్యవేక్షించారు. ఫతేనగర్ రైల్వే స్టేషన్‌లో అటు వైపు వచ్చే దారికి రైల్వే అధికారులు తాళం వేయడంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఎంఎంటీఎస్ రైలు దిగిన ప్రయాణీకులు ఫతేనగర్ బస్తీకి వెళ్లాలంటే దారి లేక శిథిలావస్థలో ఉన్న మెట్లను ఎక్కి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని రైల్వే అధికారులకు వివరించారు. సోమవారం జరిగిన ప్రమాదానికి ఇదే కారణమని తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ విషయమై స్థానిక నాయకులు, బస్తీ వాసులతో కలిసి సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌కు వెళ్లి రైల్వే డీజీఎం గోపాల కృష్ణను కలిసి వెంటనే ఫతేనగర్ స్టేషన్ గేటును తెరిపించాలని వినతి పత్రం అందజేశారు.

సంఘటనా స్థలాన్ని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

ఫతేనగర్ రైల్వే స్టేషన్ పక్కనే ఉన్న శిథిలావస్థలో ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఘటనను తెలుసుకున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ తమ పార్టీ నాయకులతో కలిసి మంగళవారం సందర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రిడ్జి పనులు చేపట్టాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం అవసరం ఉంటుందన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్స కోసం తగిన సహాయం అందేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రొటోకాల్ కార్యదర్శి సూరజ్ తివారీ, నాయకులు బండిరమేష్ వెంట ఉన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

19.36 గ్రా. కొకైన్, 6.77గ్రా కుష్‌గంజాయి, రూ. 55వేల నగదు, ఐఫోన్ స్వాధీనం



పట్టుబడిన మత్తుపదార్థాలు, నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

బాలానగర్, మే 27(ఆంధ్రజ్యోతి): బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధి బేగంపేట్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు సోదాలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్ ఆదేశాలతో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిరణ్ పర్యవేక్షణలో సోమవారం రాత్రి బేగంపేటలో ఈ సోదాలను నిర్వహించారు. బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన వివరాలు వెల్లడించారు. అధికారులు చేపట్టిన సోదాల్లో నిషేధిత మత్తు పదార్థాలను అమ్ముతూ పట్టుబడిన కరణ్‌పరమార్(32) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 19.36 గ్రా. కొకైన్, 6.77గ్రాముల కుష్‌గంజాయి. రూ.55వేల నగదు, ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కరణ్‌పరమార్ గోవాకు చెందిన సంతోష్ జావీద్ అనే వ్యక్తి వద్ద నుంచి కొరియర్‌లో మత్తు పదార్థాలను రవాణా చేసుకుని నగరంలో కావలసిన వారికి విక్రయిస్తున్నట్లు పోలీసులు వివరించారు. సీజ్ చేసిన మత్తు పదార్థాల విలువ రూ. 4 లక్షల 30 వేలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. సమావేశంలో బాలానగర్ ఎక్సైజ్ సీఐలు బాలరాజు, సుభాష్‌చందర్, ఎస్ఐలు రవిచల్లా, వెంకటేశ్వర్లు, అఖిల్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

హైదర్‌నగర్, మే27 (ఆంధ్రజ్యోతి): గంజాయి, చెడు వ్యసనాలకు బానిసై ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరు యువకులను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేపీహెచ్‌బీ డీఐ రవికుమార్ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ వెస్ట్ గోదావరికి చెందిన దామోదర్ (19) కొండాపూర్‌లో వాటర్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈస్ట్‌గోదావరికి చెందిన సిద్దుకు దామోదర్‌తో పరిచయం ఏర్పడింది. వీరు చెడు వ్యసనాలకు బానిసలై బైక్‌ల దొంగతనం మొదలుపెట్టారు. వీరిలో సిద్దుకు గతంలో బైక్ దొంగతనాలు చేసిన నేర చరిత్ర ఉంది. దొంగతనం చేసిన వాటిని కుదవ పెట్టడం, అమ్మడం చేస్తుంటారు. ఇటీవల కేపీహెచ్‌బీ, మియాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనం చేసి వాటిని తమ వాహనాలేనని నమ్మించి బీదర్‌లో విక్రయించారు. సోమవారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్రవాహనాల చోరీ నిందితులుగా గుర్తించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో కార్పొరేటర్ మందడి

కేపీహెచ్‌బీ కాలనీ, మే 27 (ఆంధ్రజ్యోతి): సర్దార్‌పటేల్‌నగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయ దశమ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి మంగళవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు అభిషేకం, చక్రస్నానం చేయించారు. వేడుకల్లో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. వెంకన్నను దర్శించుకొని భక్తజనం పరవశించిపోయారు.



తారానగర్‌లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్తను తరలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎట్టకేలకు చెత్త తొలగింపు

గచ్చిబౌలి, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు తారానగర్‌లో ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. 'ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసాలు' కథనంతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి పేరుకు పోయిన చెత్తను తరలించారు. చాలా కాలంగా తారానగర్ దుకాణా సముదాయాల మధ్యనున్న ఖాళీ స్థలంలో చెత్త పేరుకుపోయి మురుగునీరు చేరడంతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో దోమలకు ఆవాసాలుగా మారి స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు ఉదయం 6 గంటల నుంచే వాహనాల ద్వారా పేరుకుపోయిన చెత్తను తరలించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు చెత్తను తరలించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శిక్షణ తీసుకోబోయే ట్రాన్స్ జెండర్లతో ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి

స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తే మంచి భవిష్యత్

చందానగర్, మే27 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తే భవిష్యత్ ఉంటుందని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ వి.మోహన్‌రెడ్డి అన్నారు. సర్కిల్ పరిధి హఫీజ్‌పేట్ డివిజన్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ సమీపంలో కమ్యూనిటీ హాల్‌లో లైట్ హౌజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభించారు. కార్యక్రమానికి ఉప కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రస్తుత తరుణంలో ప్రతీ ఒక్కరు తమకు నచ్చిన స్వయం ఉపాధి రంగాల్లో సామర్థ్యాన్ని పెంపొందించుకొని రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్లు ఈ అవకాశాన్ని సక్రమంగా వినియోగించుకొని లబ్ధిపొందాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు ప్రత్యేక దృష్టి పెడితే ఆ కుటుంబంలో కూడా మార్పు వస్తుందన్నారు. కార్యక్రమంలో లైట్ హౌజ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి: కార్పొరేటర్ కుమార్

గచ్చిబౌలి, మే 27 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెర్వు డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకోసం నిధులు మంజూరు చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడేకు కార్పొరేటర్ కుమార్ యాదవ్ వినతి పత్రం సమర్పించారు. డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కమిషనర్‌తో చర్చించారు.

డెబ్రిస్ తరలింపు ధరలు తగ్గించాలి : సీపీఐ

గచ్చిబౌలి, మే 27 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి, చందానగర్ జంట సర్కిళ్ల పరిధిలో డెబ్రిస్ తరలింపు ధరలను తగించాలని సీపీఐ డిమాండ్ చేసింది. మంగళవారం ఆ పార్టీ మండల కార్యదర్శి రామకృష్ణ ఈ మేరకు జోనల్ కమిషనర్ హేమంత్ భోఖర్డే కు వినతి పత్రం సమర్పించారు.

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం

- అన్ని రంగాల్లో భారత్ పురోగతి
- కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్
- ఐఎస్‌బీలో కేంద్ర ఆర్థిక గణాంకాల వార్షిక సర్వే ఫలితాల డేటాపై సదస్సు



సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ అనంత నాగేశ్వరన్

రాయదుర్గం, మే27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం కొనసాగుతుంటే భారత్ అన్ని రంగాల్లో స్థిరమైన పురోగతి సాధిస్తుందని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి.అనంత నాగేశ్వరన్ అన్నారు. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ, జాతీయ గణాంకాల కార్యాలయం, ఐఎస్‌బీ, ఇన్‌కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తాధ్వర్యంలో 2023-24 వార్షిక సర్వే డేటా ఫలితాలపై మంగళవారం ఐఎస్‌బీలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. తయారీ రంగంలో పటిష్టమైన మూల ధన వ్యయంతో సంస్థలు, మహిళా వ్యవస్థాపక వృద్ధిలో పురోగతి సాధిస్తుందన్నారు. ఇన్ కార్పొరేటెడ్, వ్యవసాయేతర రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధిస్తున్నామని ఈ సర్వే గణాంకాల డేటా వెల్లడిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న అనిశ్చితి యుగంలో భారత ప్రభుత్వ విధాన పరమైన సంస్కరణలు రూపొందించటానికి ఇటువంటి వివరణాత్మకమైన డేటా ఎంతో కీలకంగా మారుతుందన్నారు. గణాంక కార్యక్రమాల కార్యదర్శి డాక్టర్ సౌరబ్‌గార్గ్ మాట్లాడుతూ, ప్రభుత్వం పటిష్టమైన పురోగతికి అన్ని రంగాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించిన గణాంకాల డేటా భవిష్యత్తులో ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ డేటాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

హైదర్‌నగర్, మే27 (ఆంధ్రజ్యోతి): పేదకుటుంబాల్లో ఆడ పిల్లల వివాహాలకు అండగా నిలవ్వాలని ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి (పార్ట్) డివిజన్ల పరిధిలోని పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ 10మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు అందజేయడం సంతోషకరమన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడబిడ్డకు పెద్దఅన్నలాగా నిలుస్తున్నారని తెలిపారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శ్రీకారం

హైదర్‌నగర్ డివిజన్ రాంనరేష్‌నగర్‌లో రూ.35లక్షల అంచనాతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులు కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రియాకం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహంకాళినగర్‌లో పనులను పరిశీలిస్తున్న వెంకటేష్‌గౌడ్

సీసీరోడ్డు పనుల పరిశీలన

హైదర్‌నగర్, మే27 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ ఉజ్జయిని మహంకాళినగర్‌లో నిర్మిస్తున్న సీసీరోడ్డును కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, ఏఈ శ్రావణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, సీసీరోడ్డు పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీపడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్డును లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలవకుండా, ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్



ఇళ్లలో నిల్వవున్న నీటిని తొలగిస్తున్న ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది

హైదర్‌నగర్, మే27 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో దోమల నివారణలో భాగంగా కూకట్‌పల్లిజోన్ సీనియర్ ఎంటమాలాజిస్టు ఆదేశాలతో మంగళవారం ఏఈ తేజశ్రీ, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు బృందాలు ఇంటికివెళ్లి తనిఖీ చేశారు. ప్రతీ ఒక్కరు ఇంటి లోపల, బయట ఎక్కువ రోజులు నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వవుంటే దోమలు గుడ్లు పెట్టి ఉత్పత్తికి కారణం అవుతున్నాయని, సెంటెక్స్ ప్లాస్టిక్ డ్రమ్ములు, సిమెంట్ తొట్టెలు, నల్లా గుంతలు పూలకుండీలలో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ధరణీనగర్ కాల నీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌లు దొంగిలిస్తున్న వ్యక్తి అరెస్ట్

మియపూర్ , మే27 (ఆంధ్రజ్యోతి): అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇళ్లలోకి చొరబడి ఇంట్లో ఉన్న సెల్‌ఫోన్‌లను దొంగతనం చేస్తున్న ఓ వ్యక్తిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ రమేష్ నాయుడు వివరాల ప్రకారం.. నగరంలోని యూసఫ్‌గూడ కార్మికనగర్‌కు చెందిన రాపనోళ్ల మహేష్ జైలు నుండి వచ్చాక కూడా దొంగతనాలకు పాల్పడుతున్నాడు. పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 10 కేసులున్న మహేష్ మియాపూర్ న్యూహఫీజ్‌పేట్ ఆదిత్య నగర్ కాలనీలో మహమ్మద్ ఆసిఫ్ తన ఇంట్లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చేరబడి సెల్‌ఫోన్లు దొంగతనాలకు పాల్పడ్డారని మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మహేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. అతడి వద్ద రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇండ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నది తానేనని అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీస్ సంరక్షణలో.. తప్పి పోయిన బాలిక



మియపూర్ , మే27 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలిక మియాపూర్ పోలీసుల సంరక్షణలో ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం గోపాల్‌నగర్ కాలనీలో ఎనిమిదేళ్ల బాలిక తప్పి పోయింది. గుర్తించిన పోలీసులు బాలికను తమ సంరక్షణలో ఉంచారు. తన పేరు జ్యోతిక, తల్లిదండ్రుల పేర్లు అఖిల, నవీన్ అని చెప్తుతుందని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఎవరైనా ఈ పాపను గుర్తిస్తే 87125 68116 సంప్రదించాలని కోరారు.

పసికందు మృతదేహం లభ్యం

రాయదుర్గం, మే27 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజుల వయస్సు కలిగిన పసికందు మృతదేహం లభించింది. ఎస్సై రాజశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ ఏరియా ఆసుపత్రి సమీపంలో పసిబిడ్డ మృతదేహం పడి ఉందని సోమవారం అర్థరాత్రి గచ్చిబౌలి పోలీసులకు కాల్ వచ్చింది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పసిబిడ్డకు సంబంధించిన వారి కోసం చుట్టు పక్కల విచారించినా ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

కాలనీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా : నార్నె

హైదర్‌నగర్, మే27 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని వెస్టర్న్ హిల్స్ సొసైటీ, అడ్డగుట్ట కాలనీలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న డి సిల్టింగ్ పనులను కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించామన్నారు. ప్రత్యేక చొరవతో డివిజన్‌లో అత్యవసరం ఉన్నచోట, నిత్యం సమస్యలతో ఉన్న ప్రాంతాల్లో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తిచేస్తామని తెలిపారు. కాలనీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతూ సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన ప్రజా జీవనానికి కావాల్సిన సౌకర్యాల కల్పనకు కృషిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ రాజీవ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

పేట్‌బషీరాబాద్,మే 27(ఆంధ్రజ్యోతి) : 'రోడ్లపై మురుగు పరుగు' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. జీడిమెట్ల డివిజన్‌లోని శివాలయం వద్ద, కుత్బుల్లాపూర్ గ్రామం చౌరస్తా సమీపంలోని చర్చి వద్ద, రాఘవేంద్ర కాలనీ ఇండియన్ పెట్రోల్ బంక్ పక్క వీధిలో మ్యాన్‌హోల్స్‌ను గల్పర్ మిషన్‌తో శుభ్రం చేసి మురుగు సమస్యను పరిష్కరించారు. దీంతో ఆంధ్రజ్యోతికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరి

నాణ్యతతో అభివృద్ధి పనులు చేపట్టాలి

గాజులరామారం, మే 27 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాణ్యతతో పనులను పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని మహాదేవపురంలో రూ. 60 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాజులరామారం డివిజన్‌లో నెలకొన్న సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు జగదీశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, సిద్దార్థ, నాయుడు, రవి, గౌతమ్, వెంకటేశ్వరరావు, బీఆర్ నాయుడు ఉన్నారు.



పోలీసు స్టేషన్ సెట్

గాజులరామారంలో మారేడుమిల్లి పోలీస్ స్టేషన్!

● వెబ్‌సిరీస్ షూటింగ్ కోసం ఏర్పాటు

కుత్బుల్లాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరా బాద్ మున్సిపల్ కార్పొరే షన్ గాజులరామారం సర్కిల్ పరిధి లోని హెచ్ఎంటీ అటవీ ప్రాంతం లో మారేడుమిల్లి పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అదేంటి.. అల్లూరి జిల్లాలో ఉండాల్సిన పోలీస్ స్టేషన్ ఇక్కడెందుకుందని అనుకుంటున్నారా..? ఇది అక్షరాల నిజం. కాకపోతే ఓ వెబ్ సిరీస్ షూటింగ్ కోసం ఇక్కడ ఈ పోలీస్ స్టేషన్ సెట్‌ను ఏర్పాటు చేసినట్లు అక్కడున్న వారు తెలిపారు. కాగా, ఈ మారేడుమిల్లి పీఎస్‌ను చూసేందుకు చుట్ట పక్కల ప్రాంతాల ప్రజలు భారీగా చేరుకుంటున్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

● ఎమ్మెల్యే వివేకానంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

పేట్‌బషీరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపాలిటీని ప్రణాళికాబద్ధంగా మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మంగళ వారం కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజాసమస్యలపై ఆయన జలమండలి, ట్రాఫిక్, ఎలక్ట్రికల్ అధికారులతో సమీక్షించారు. మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్య, నత్తనడకన సాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు, శానిటేషన్ తదితర సమస్యలపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, గత పదేళ్లలో గ్రేటర్ హైదరాబాద్‌కు దీటుగా శివారు మున్సిపాలిటీలైన కొంపల్లి, దుండిగల్, నిజాంపేట్ కార్పొరేషన్ ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయని, ఈ మున్సిపాలిటీలో అధికారులు పర్యటిస్తూ, ప్రధాన సమస్యలను గుర్తించి, ఎప్పటికప్పుడు పరిష్కరించినప్పుడే అధికారులను ప్రజలు గుర్తు పెట్టుకుంటారన్నారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసినప్పుడు మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ప్రత్యేక అధికారి చంద్రమోహన్, కమిషనర్ కృష్ణారెడ్డి, మేనేజర్ వెంకటేశం, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌చార్జి సీఐ హనుమాన్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

రమాబాయి అంబేడ్కర్ గొప్ప మానవతావాది: సీపీఐ

నిజాంపేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): రమాబాయి అంబేడ్కర్ గొప్ప మానవతావాది అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. రమాబాయి 89వ వర్థంతి సందర్భంగా షాపూర్‌నగర్‌లో ఆమె చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వామి, హరినాథ్, రాములు, నర్సింహారెడ్డి, నాగయ్య, కనకయ్య, విఠల్ పాల్గొన్నారు.

కట్టమైసమ్మ ఆలయ ఈఓపై చర్యలు తీసుకోవాలి

● ధర్మకర్త మన్నే ముత్యాలు

జీడిమెట్ల,మే27(ఆంధ్రజ్యోతి): సూరారం కట్టమైసమ్మ ఆలయ ఈఓ కొందరు నాయకులతో కలిసి అవినీతికి పాల్పడుతున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఆలయ ధర్మకర్త మన్నే ముత్యాలు, స్థాని కులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆలయ ఆవరణలో స్థానికులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నాలుగు నెలల క్రితం ఆలయాన్ని దేవాదాయ శాఖ తన పరిధిలోకి తీసుకుందన్నారు. గతంలో కొందరు స్థానిక నాయకులు ఆలయంపై పెత్తనం చేసేవారని, నేడు ఈఓగా ఉన్న కృష్ణమాచార్యులు వారితో చేతులు కలిపి ఆలయానికి వచ్చే డొనేషన్లు, హుండీ ఆదాయాన్ని బ్యాంకులో జమ చేయకుండా దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. కొబ్బరికాయల దుకాణాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అడ్డదారిలో కట్టపెట్టి రూ. 5 లక్షలు తీసుకున్నట్టు ఆరోపించారు.

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

దుండిగల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి 50 శాతం సబ్సిడీపై వచ్చిన పచ్చిరొట్ట (జనుము, జీలుగ) విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బౌరంపేట ప్రాథమిక వ్యవసాయ సంఘం చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి అన్నారు. సహకారం సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన మండల వ్యవసాయాధికారి యాదగిరితో కలిసి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దుండిగల్, బౌరంపేట సొసైటీ సంఘాల రైతులందరూ తమ పాస్‌బుక్, ఫోన్‌నెంబరు ఆధార్‌కార్డు తీసుకు వచ్చి ఈ విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. డైరెక్టర్ బీమ్‌రెడ్డి, చౌదరి, మహిపాల్‌రెడ్డి, రైతులు కట్టా అమరేందర్‌రెడ్డి, వీరారెడ్డి, నర్సారెడ్డి, ఈశ్వరయ్య, భరత్‌రెడ్డి, భిక్షపతి ఉన్నారు.

త్వరలో సమస్యలు పరిష్కరిస్తా

● బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి

పేట్‌బషీరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి):జీడిమెట్ల డివిజన్‌లోని ఫస్ట్ ఎవెన్యూ కాలనీలో గురువారం బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, వాటిని పరిష్కరించేందుకు సహకరించాలని స్థానికులు కోరారు. ఆయా సమస్యలను త్వరలోనే పరిష్క రించేందుకు కృషి చేస్తానని భరత్ సింహారెడ్డి వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మధుగౌడ్, నాగేశ్వరరావు, రామ్‌రెడ్డి, ధనుంజయరావు, కిషోర్, మరికొంత మంది పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వార నిర్మాణానికి విరాళం

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఆర్‌జికే కాలనీలో ఉన్న ఉమామహేశ్వరస్వామి, నల్లపోచమ్మ దేవాలయ ముఖ ద్వారం నిర్మాణం కోసం రూ. 25 వేలను విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పితాని శ్రీనివాస్‌గౌడ్, ట్రెజరర్ రమణ, అశోక్, సత్యనారాయణ, కె. సత్యనారాయణలు పాల్గొన్నారు.

(నిజాంపేట్, మే 27 ఆంధ్రజ్యోతి)



అన్ని రంగాల్లో భారత్ పురోగతి

● కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్



రాయదుర్గం, మే27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం కొనసాగుతుంటే భారత్ అన్ని రంగాల్లో స్థిరమైన పురోగతిని సాధిస్తోందని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి.అనంత నాగేశ్వరన్ అన్నారు. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ, జాతీయ గణాంకాల కార్యాలయం, ఐఎస్‌బీ, ఇన్‌కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తాధ్వర్యంలో 2023-24 వార్షిక సర్వే డేటా ఫలితాలపై మంగళవారం ఐఎస్‌బీలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంత నాగేశ్వరన్ హాజరై కీలక ఉపన్యాసం చేశారు. తయారీ రంగంలో పటిష్టమైన మూల ధన వ్యయంతో సంస్థలు పురోగతి సాధిస్తున్నాయన్నారు. అలాగే, ఇన్‌కార్పొరేటెడ్, వ్యవసాయేతర రంగాల్లో గణనీయమైన వృద్ధిని సాధిస్తున్నట్టు ఈ సర్వే గణాంకాల డేటా వెల్లడిస్తోందన్నారు. గణాంక కార్యక్రమాల కార్యదర్శి డాక్టర్ సౌరబ్‌గార్గ్ మాట్లాడుతూ, ప్రభుత్వం పటిష్టమైన పురోగతికి అన్ని రంగాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించిన గణాంకాల డేటా భవిష్యత్తులో ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గోడకేసి కొట్టి.. ఆపై గొంతు నులిమి.. భర్తను హత్య చేసిన భార్య

● నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



కిషన్ నాయక్ (ఫైల్)

వనస్థలిపురం, మే 27(ఆంధ్రజ్యోతి): భర్తను గోడకేసి కొట్టి.. ఆపై గొంతు నులిమి హత్య చేసిందో మహిళ. అనంతరం ప్రమాదవశాత్తూ చనిపోయాడని పోలీసులతో సహా అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వనస్థలిపురం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం భావత్ తండాకు చెందిన ఆటో డ్రైవర్ సభావత్ కిషన్ నాయక్(40)కు కళతో 2005లో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. మొదటి భార్య మృతి చెందడంతో పిల్లలు ముగ్గురూ అమ్మమ్మ వద్ద ఉంటున్నారు. కిషన్ నాయక్ నగరానికి వచ్చి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇలా ఉండగా, యాదాద్రి - భువనగిరి జిల్లా గోకారం గ్రామానికి చెందిన శిరీషకు భర్తతో మనస్పర్థలు రావడంతో 2015లో విడాకులు తీసుకుంది. ఈమెకు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న కిషన్ నాయక్‌తో పరిచయం ఏర్పడటంతో 2015లో రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అమ్మమ్మ దగ్గర ఉంటున్నారు. భార్యాభర్తలు కిషన్ నాయక్ గ్రామంలో వ్యవసాయం చేసుకొనేవారు. ఈ క్రమంలో శిరీషకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కిషన్ నాయక్ భార్యను మందలించడంతో గొడవ జరిగేది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం వనస్థపురంలోని హిల్‌కాలనీకి మకాం మార్చారు. కిషన్ నాయక్ సోమవారం సాయంత్రం మద్యం తాగి తన భార్య పనిచేసే చోటికి వెళ్లి ఆమెతో గొడవపడి ఇంటికి తీసుకొచ్చాడు. మరోసారి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తనపై అనుమానం వ్యక్తం చేయడమే కాకుండా ఆఫీసు కొచ్చి గొడవపడాడ్డని కోపోద్రిక్తురాలైన శిరీష భర్త కిషన్ నాయక్‌ను గట్టిగా గోడకేసి కొట్టింది. తర్వాత గొంతు నులిమి హత్య చేసింది. అనంతరం అంబులెన్స్‌లో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లింది. కిషన్ నాయక్‌కు పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఇలా ఉండగా, కిషన్ నాయక్ మొదటి భార్య కూతురు బిందు తన తండ్రిని శిరీష చున్నీతో హత్య చేసిందని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు శిరీషపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.